సాక్షి నిర్మల్

గురువారం । 31 । ఆగస్టు । 2023



దూది గొండలే ప్రత్యేకం

మహారాష్ట్రకు సమీపంలోని భైంసాలాంటి ప్రాంతాల్లో రాఖీలను గొండలు అంటారు. సన్నని దారం, దూదితో చేసిన వీటిని పూజారులు, అర్చకులు ఇంటింటా పంపిణీ చేస్తారు. 8లో▶



ప్రారంభానికి ముందే పగుళ్లు

న్యూలోలం నుంచి దిలావర్‌పూర్‌తండా వరకు నిర్మించిన రోడ్డు ఐదునెలలకే కంకర తేలి గుంతలు పడింది. దీంతో ద్విచక్రవాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. 9లో▶

వాతావరణం

గరిష్టం/కనిష్టం
33.0 /24.0

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. జిల్లాలో పలుచోట్ల జల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

తెరుచుకోని ప్రభుత్వ పాఠశాల



తెరుచుకోని కొండుకూర్ ప్రాథమిక పాఠశాల

కడెం: నిర్మల్‌–మంచిర్యాల ప్రధాన రహదారి పక్కనున్న మండలంలోని కొండుకూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల బుధవారం మధ్యాహ్నం 12 గంటలైనా తెరుచుకోలేదు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులు ఉపాధ్యాయుడి రాక కోసం వేచి చూసి చివరికి ఇంటిబాట పట్టారు. దీంతో తల్లిదండ్రులు అధికారులకు ఫోన్ చేసి పాఠశాలకు సెలవా? అని ప్రశ్నించగా.. వెంటనే ఉపాధ్యాయుడిని పంపించారు. ఈ విషయమై కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయురాలు విజయస్వప్నను వివరణ కోరగా.. పాఠశాల ఉపాధ్యాయురాలు చైల్డ్‌కేర్ లీవ్‌లో వెళ్లడంతో ప్రత్యామ్నాయంగా నియమించిన ఉపాధ్యాయుడు ఆలస్యంగా వెళ్లారని తెలిపారు.

ముగిసిన అభ్యసన సామర్థ్యాల మదింపు

నిర్మల్ ఖిల్లా: జిల్లాలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల స్థాయిలోని విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను అధ్యయనం చేసేందుకు ఛాత్రోపాధ్యాయుల ద్వారా విద్యాశాఖ చేపట్టిన ప్రత్యేక మదింపు కార్యక్రమం బుధవారం కొనసాగింది. రాష్ట్ర ప్రభుత్వం, సెంటర్ ఫర్ స్క్వేర్ ఫౌండేషన్ సమన్వయంతో మూడురోజులుగా సర్వే నిర్వహించింది. జిల్లాలోని 50 పాఠశాలలను ఇందుకు ఎంపిక చేశారు. ప్రాథమిక స్థాయిలో మూడో తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పాఠశాలకు ఎనిమిది మంది విద్యార్థులను తెలుగు, గణితం, ఇంగ్లిష్ సబ్జెక్టులలో వ్యక్తిగతంగా పరీక్షించగా, ఇందుకు డైట్ కళాశాలలో చదువుతున్న డీఎడ్ ఛాత్రోపాధ్యాయులను నియమించారు. సామర్థ్యాల వివరాలు ట్యాంగరిన్ అనే యాప్ ద్వారా విద్యార్థుల వారీగా నమోదు చేశారు.

పాఠశాలల తనిఖీ



డీఈవోకు రాఖీ కడుతున్న ఉపాధ్యాయులు

దస్తురాబాద్: మండలంలోని మున్యాల జెడ్పీ హైస్కూల్, రేవోజీపేట, బుట్టాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను బుధవారం డీఈవో రవీందర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించగా ఉపాధ్యాయురాళ్లు డీఈవోకు రాఖీ కట్టారు. అలాగే మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు కోట వేణు, శేఖర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

‘ఉన్నతి’ శిక్షణ శిబిరం పరిశీలన

నిర్మల్ రూరల్: జిల్లా కేంద్రంలోని పంచశీల కళాశాలలో రెండురోజులుగా నిర్వహిస్తున్న ఉన్నతి శిక్షణ శిబిరాన్ని డీఈవో రవీందర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను తప్పనిసరిగా పాటించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అధికారులు రవి, పరమేశ్వర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



పార్టీలో చేరిన యువకులతో శ్రీహరిరావు

నిర్మల్‌చైన్‌గేట్: దిలావర్‌పూర్ మండలం మల్లాపూర్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు బుధవారం జిల్లా కేంద్రంలో కాంగ్రెస్‌లో చేరగా వీరికి డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి రాష్ట్ర మంత్రి ఐకేరెడ్డి చేసిందేమీ లేదని విమర్శించారు. డీ1 పట్టాల పేరుతో వేల ఎకరాల ప్రభుత్వ భూములు కబ్జా చేశారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని చెప్పారు. నాయకులు, కార్యకర్తలు కష్టపడి నిర్మల్‌లో కాంగ్రెస్ జెండా ఎగురవేసేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. నాయకుడు అర్జుమాన్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపిక



కిషన్

ఖానాపూర్: నల్గొండకు చెందిన పుడమి సాహితీ సంస్థ ప్రదానం చేయనున్న సర్వేపల్లి రాధాకృష్ణన్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు పాత ఎల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుడు వాల్గోట్ కిషన్ ఎంపికయ్యారు. సేవా కార్యక్రమాల్లో పాల్గొంటున్నందునే ఎంపిక చేసినట్లు కిషన్ తెలిపారు.

అభయహస్తం ఎవరికో?

- కాంగ్రెస్‌లో భారీగా ఆశావహులు
- టికెట్‌కు దరఖాస్తు చేసిన నేతలు
- ఖానాపూర్ నుంచి 15 దరఖాస్తులు
- సెప్టెంబర్ 2న షార్ట్‌లిస్ట్ ప్రకటన



నిర్మల్: కాంగ్రెస్ టికెట్ కోసం జిల్లా నుంచి దరఖాస్తు చేసుకున్న ఆశావహుల జాబితా చాంతాడంతా ఉంది. అత్యధికంగా ఖానాపూర్ నియోజకవర్గం నుంచి ఎక్కువ సంఖ్యలో నేతలు దరఖాస్తు చేసుకున్నట్లు తెలుస్తోంది. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులను ముందే ఎంపిక చేయకుండా.. పార్టీ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరించింది. ఇందుకు సంబంధించిన దరఖాస్తులను మంగళవారం ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ)కి అప్పగించింది. ప్రస్తుతానికి పేర్లు పరిశీలించిన కమిటీ ఎంపిక సమావేశాన్ని వచ్చేనెల 2కు వాయిదా వేసింది. ఇక జిల్లాలోని మూడు నియోజకవర్గాల నుంచి ఆశావహుల జాబితా చాంతాడంత ఉండటం గమనార్హం.

నిర్మల్ నుంచి ఐదుగురు..

రాజకీయ కేంద్రమైన నిర్మల్ నియోజకవర్గంలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ప్రధాన నేతగా ఉన్నప్పటికీ పార్టీ అడిగిన మేరకు పలువురు సీనియర్లు కూడా టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. టీపీసీసీ ఇచ్చిన జాబితాలో కూచాడి శ్రీహరిరావు పేరు ముందుంది. ఆ తర్వాత సారంగపూర్ జెడ్పీటీసీ సభ్యుడు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, సేవాదళ్ సీనియర్ నాయకుడు ఎంబడి రాజేశ్వర్, సారంగపూర్ ఏఎంసీ మాజీ చైర్మన్ దశరథ రాజేశ్వర్, ప్రముఖ న్యాయవాది, సీనియర్ నేత అల్లూరి మల్లారెడ్డి పేర్లు ఉన్నాయి. పార్టీ టికెట్ కోసం వీరు దరఖాస్తు చేసుకున్నప్పటికీ కార్యక్రమాల్లో మాత్రం కలిసే పాల్గొంటున్నారు.

ముధోల్ నుంచి నలుగురు..

తెలంగాణ సరిహద్దు నియోజకవర్గమైన ముధోల్‌లోనూ హస్తానికి పోటాపోటీ నెలకొంది. ఇక్కడి నుంచి కాంగ్రెస్ టికెట్ ఆశిస్తూ దరఖాస్తు చేసుకున్న వారిలో ఎన్ఆర్ఐ, సీనియర్ నేత పత్తిరెడ్డి విజయకుమార్‌రెడ్డి, జిల్లాలో సీనియర్‌నేతగా ఉన్న సింధే ఆనంద్‌రావు, ఇటీవల పార్టీలో చేరిన డాక్టర్ కిరణ్‌కుమార్, మహ్మద్ అబ్దుల్ లతీఫ్ పేర్లు ఉన్నాయి. ఈ నలుగురిలో ప్రస్తుతం డాక్టర్ కిరణ్‌కుమార్ టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు. క్షేత్రస్థాయిలో కూడా పార్టీ పరిశీలన చేపట్టాకే టికెట్ ఇవ్వనున్నట్లు చెబుతున్నారు.

ఖానాపూర్ నుంచి అత్యధికంగా..

ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గమైన ఖానాపూర్‌లో కాంగ్రెస్ టికెట్‌కు భారీగా డిమాండ్ ఉంది. ఇక్కడి నుంచి ఏకంగా 15మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో ప్రధానంగా బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్ పేరు ఉండటం గమనార్హం. జాబితాలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెడ్మ బొజ్జు పేరు ప్రథమస్థానంలో ఉంది. మిగతావారిలో ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శి భరత్‌చౌహాన్, ఉట్నూర్ జెడ్పీటీసీ సభ్యురాలు చారులత రాథోడ్, భూక్య చంద్రశేఖర్, లావుడ్య భక్షినాయక్, జాదవ్ రాంకిషన్‌నాయక్, సునీల్‌జాదవ్, గుగ్లావత్ కిశోర్‌కుమార్, జాదవ్ శ్రవణ్‌కుమార్, కొట్నాక్ రమేశ్, సబావత్ రాములునాయక్, పుర్క బాపురావు, పెందూర్ ప్రభాకర్, బాదావత్ వినోద్‌కుమార్ నాయక్ ఉన్నారు. ఇందులో ప్రధానంగా వెడ్మ బొజ్జు, సిట్టింగ్ ఎమ్మెల్యే రేఖానాయక్, భరత్‌చౌహాన్, వినోద్‌కుమార్‌నాయక్, చారులత రాథోడ్ పేర్లు పరిశీలనలో ఉన్నట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి.

ఎవరికి ఇచ్చినా..

కాంగ్రెస్‌లో తొలిసారి ఎమ్మెల్యే టికెట్ కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ చేపట్టారు. దీంతో చోటామోటా లీడర్లు కూడా హైదరాబాద్‌కు వెళ్లి దరఖాస్తు చేసుకున్నారు. వారంతా పార్టీ తమను పరిగణనలోకి తీసుకుని టికెట్ ఇస్తేనే పోటీ చేస్తామంటున్నారు. లేని పక్షంలో పార్టీ ఎవరికి టికెట్ ఇస్తే వారి గెలుపు కోసం పనిచేస్తామని స్పష్టం చేస్తున్నారు. నిర్మల్, ముధోల్, ఖానాపూర్ నియోజకవర్గాల్లో సీనియర్లు ఉన్నప్పటికీ వారంతా ప్రస్తుతం కలిసే కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. చాలామంది సీనియర్లు, క్షేత్రస్థాయిలో క్యాడర్ బీజేపీ, బీఆర్ఎస్‌లోకి వెళ్లడంతో ముందుగా పార్టీని బలోపేతం చేయాలని కాంగ్రెస్ యోచిస్తోంది. ఓవైపు పార్టీని పటిష్టం చేస్తూ.. ఎన్నికల్లో గెలిచే సత్తా ఉన్న నేతకే టికెట్ వస్తుందని స్పష్టం చేస్తోంది. ప్రస్తుతం ఆశావహుల జాబితాను ప్రదేశ్ ఎన్నికల కమిటీకి అప్పగించిన టీపీసీసీ వచ్చేనెల 2న అభ్యర్థుల పేర్లను ఓ కొలిక్కి తేనున్నట్లు పార్టీ నేతలు చెబుతున్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



ఆలయంలో పూజలు చేస్తున్న మంత్రి ఐకేరెడ్డి

మామడ: మండలంలోని పరిమండల్ గ్రామంలో నూతనంగా నిర్మించిన రామాలయంలో బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా కనకాపూర్ క్రాస్ రోడ్డు నుంచి పరిమండల్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. డీసీసీబీ మాజీ చైర్మన్ కొరిపెల్లి రాంకిషన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ ఏనుగు లింగారెడ్డి, నాయకులు చంద్రశేఖర్ గౌడ్, భాస్కర్‌రావ్, నల్ల లింగారెడ్డి, కైలాస్, వికాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన నియామకం

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ పార్లమెంట్ సోషల్ మీడియా జాయింట్ కన్వీనర్‌గా లక్కడి శ్రావణ్‌రెడ్డిని నియమించినట్లు కన్వీనర్ ఎస్.నరేశ్‌చౌబే ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా పలువురు శ్రావణ్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలిపి అభినందించారు.

రెగ్యులరైజ్ చేయాలి

నిర్మల్‌చైన్‌గేట్: సీఎం కేసీఆర్ గత ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు సమగ్రశిక్షలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులరైజ్ చేయాలని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన బుధవారం సంఘీభావం తెలిపారు.

‘ఆసరా’.. మరింత



దివ్యాంగులకు ఉపకరణాలు అందజేస్తున్న మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి (ఫైల్)

- పింఛన్ పెంపుతో దివ్యాంగుల్లో ఆనందం
- జిల్లాకు అదనంగా రూ.1.05 కోట్లు
- 10,540 మందికి ప్రయోజనం

నియోజకవర్గాల వారీగా దివ్యాంగ పింఛన్లు	
నిర్మల్ 4,569,	ముధోల్ 3,989
ఖానాపూర్ 1,982	

నిర్మల్‌చైన్‌గేట్: గత ప్రభుత్వాల హయాంలో ఎలాంటి ఆదరణ లేక దివ్యాంగులు అనేక ఇబ్బందులు పడేవారు. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే ఆసరా పింఛన్ పెంచింది. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో పింఛన్ కొంత పెంచి లబ్ధిదారులకు భరోసా కల్పించారు. అయితే స్వరాష్ట్రంలో దివ్యాంగులకు పింఛన్ పెంచాలనే ఉద్దేశంతో ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలో భాగంగా ముఖ్యమంత్రి కేసీఆర్ బాధ్యతలు చేపట్టగానే దివ్యాంగులకు నెలకు రూ.2,016, ఇతరులకు రూ.1,016 అమలు చేస్తున్నారు. రెండోసారి అధికారంలోకి వచ్చాక దివ్యాంగుల పింఛన్‌ను రూ.3,016, ఇతర పింఛన్లు 2,016కు పెంచారు. తాజాగా దివ్యాంగుల పింఛన్‌ను రూ.4,106 పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించారు. జూలై నుంచి పెంచిన పింఛన్ అందిస్తామని తెలిపారు. ఈమేరకు జూలై పింఛన్లను ప్రస్తుతం పంపిణీ చేస్తున్నారు. దీంతో దివ్యాంగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పింఛన్‌తోపాటు ఉపకరణాలు, వాహనాలు, ఇతర రూపాల్లో ప్రభుత్వం చేయూతనిస్తోంది.

జిల్లాలో 10,540 మందికి లబ్ధి

ప్రభుత్వ నిర్ణయంతో జిల్లా వ్యాప్తంగా 18 మండలాల్లో మొత్తం 10,540 మంది దివ్యాంగులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రస్తుతం ప్రభుత్వం ఆసరా పథకంలో భాగంగా రూ.3,016 చొప్పున జిల్లాకు రూ.3.17కోట్లు కేటాయించింది. రూ.వెయ్యి పెంపుతో ప్రభుత్వంపై అదనంగా రూ.1.05 కోట్లతో కలిపి రూ.4.22 కోట్లు కేటాయించనుంది.

పెరగనున్న దరఖాస్తులు

దివ్యాంగులకు రూ.3,016 పింఛన్‌తోపాటు బస్సు, రైల్వే ప్రయాణాల్లో రాయితీలు ఉన్నాయి. దీంతో చాలామంది సదరం సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకుంటున్నారు. నిబంధనల ప్రకారం 40 శాతం వైకల్యం ఉంటేనే పింఛన్‌తోపాటు అన్ని రకాల రాయితీలు లభిస్తాయి. సెప్టెంబర్ నుంచి రూ.4,016 పింఛన్ అందజేస్తామన్న సీఎం కేసీఆర్ ప్రకటించిన నేపథ్యంలో మరికొంతమంది అర్హులు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. జిల్లాలో చాలా మంది అర్హులైన దివ్యాంగులు ఉన్నారని.. వారికి సదరం ధ్రువపత్రాలు రావాల్సి ఉందని దివ్యాంగుల సంఘం నాయకులు చెబుతున్నారు.

బీడీ టేకేదార్లకు..

బీడీ పరిశ్రమలో పనిచేసే టేకేదార్లకు ఆసరా పింఛన్ ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. జిల్లాలో 614 మంది బీడీ టేకేదార్లున్నారు. వారికి ప్రతినెలా రూ.2,016 చొప్పున అందిస్తే.. రూ.12.37 లక్షలు వ్యయం అవుతుంది.

మిగతా వారికి కూడా..

దివ్యాంగులు మినహాయించి ఇతరులకు ఆసరా పింఛన్ పెంచాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ప్రస్తుతం వారికి రూ.2,016 చొప్పున అందిస్తున్నారు. రానున్న రోజుల్లో రూ.వెయ్యి పెంచేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే ముఖ్యమంత్రి కేసీఆర్ పలు బహిరంగ సభల్లో ఈ విషయం చెప్పుకొచ్చారు. అక్టోబర్‌లో వరంగల్‌లో నిర్వహించే సభలో దీనిపై ప్రకటన చేస్తానని సీఎం కేసీఆర్ చెప్పడంతో అందరిలో ఆశలు చిగురించాయి.

దివ్యాంగులకు తోడ్పాటు



సమాజంలో గౌరవంగా జీవించడానికి ఎలాంటి ఆధారం లేని వారికి పింఛన్ పెంపుదల మరింత తోడ్పాటు ఇస్తుంది. కుటుంబ పోషణకు ఆసరా అందించినట్లు అవుతుంది. కేసీఆర్ గొప్ప నిర్ణయం తీసుకున్నారు.

– సాయన్న, తెలంగాణ దివ్యాంగ పునరావాస అభివృద్ధి ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షుడు

వుషులో జిల్లాకు పతకాలు



పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

భైంసాటౌన్: వుషు రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటారు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఈ నెల 28, 29 తేదీల్లో ఖేలో ఇండియా రాష్ట్రస్థాయి వుషు ఉమెన్స్ లీగ్ పోటీలు జరిగాయి. అబ్జర్వర్ చంద్రకాంత్‌రావు (జిమ్నాస్టిక్ కోచ్), స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రేమ్‌రాజ్ న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారు. పోటీల్లో జిల్లా నుంచి 36 మంది క్రీడాకారులు పాల్గొని ఎనిమిది బంగారు, రెండు రజత, ఆరు కాంస్య పతకాలు సాధించారు. వీరు త్వరలో జరిగే ఖేలో ఇండియా వుషు సౌత్ జోన్ పోటీల్లో పాల్గొంటారని కోచ్ శ్రీరాముల సాయికృష్ణ తెలిపారు. సబ్ జూనియర్స్ కియాంగ్షు విభాగంలో ఏ నిర్విఘ్న బంగారు పతకం (అల్ఫోర్స్, భైంసా), తైజీజియాన్ విభాగంలో ఏ హాసిని కాంస్య పతకం (వాసవీ ఉన్నత పాఠశాల, భైంసా), తైజీక్వాన్ విభాగంలో కే అనుచంద్ర కాంస్య పతకం (కేజీబీవీ, లోకేశ్వరం), నన్‌క్వాన్ విభాగంలో జే కావేరి రజత పతకం (భాష్యం పాఠశాల, అష), బీ స్వేచ్ఛారెడ్డి కాంస్య పతకం (శ్రీ నాగభూషణ పాఠశాల, బాసర), తైజీక్వాన్ విభాగంలో డీ శైలజ, బంగారు పతకం, చాంగ్క్వాన్ విభాగంలో ఎస్.స్నేహ బంగారు పతకం, తైజీజియాన్ విభాగంలో ఎం.విజయలక్ష్మి బంగారు పతకం సాధించారు. సీనియర్స్ తైజీషాన్ విభాగంలో ఆర్ సోనీతాయి బంగారు పతకం, కియాంగ్షు విభాగంలో బీ మాధురి బంగారు పతకం, తైజీజియాన్ విభాగంలో ఎస్.భాగ్యలక్ష్మి బంగారు పతకం, ఫైట్‌–33కేజీల విభాగంలో సీహెచ్ శీతల్ కాంస్య పతకం, 48 కేజీల విభాగంలో సీహెచ్ స్పందన కాంస్య పతకం, 56 కేజీల విభాగంలో బీ అనిత కాంస్య పతకం (లోకేశ్వరం), 52 కేజీల విభాగంలో ఆర్ స్వాతి బంగారు పతకం, 52 కేజీల విభాగంలో కే స్వరూప వెండి పతకం, కే స్వరూప రజత పతకం కైవసం చేసుకున్నారు. వీరిని డీవైఎస్‌వో క్రాంతికుమార్, వుషు జిల్లా అధ్యక్షుడు నాగేశ్, కోశాధికారి చందుస్వామి, అనూష, మృణాళిని, లింగం, కిరణ్, రాజశ్రీ, మనీషా, శ్రీజ, గజేందర్ తదితరులు అభినందించారు.

జాగృత పరిచేందుకే చాలీసా పారాయణం



భైంసాకు చేరిన రథయాత్రలో స్వామీజీతో భక్తులు

భైంసాటౌన్: మానవునిలో సకల రోగాలు దూరం చేసి శక్తిని జాగృత పరిచేందుకు కోటి హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం చేపట్టినట్లు విజయవాడ హనుమాన్‌దీక్ష పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీ తెలిపారు. పాలజ్ నుంచి ప్రారంభమైన రథయాత్ర బుధవారం భైంసాకు చేరింది. మహిళలు, భక్తులు, సేవాభారతి సభ్యులు మంగళహారతులతో స్వాగతం పలికారు. కాలనీ నుంచి బస్టాండ్, పద్మావతికాలనీ, భట్టిగల్లి, పురాణబజార్, కిసాన్‌గల్లి మహదేవ్‌మందిర్ మీదుగా కిసాన్‌గల్లి శ్రీసరస్వతీశిశుమందిర్‌కు రథయాత్ర చేరుకుంది. అక్కడ స్వామీజీ చేతుల మీదుగా ఆంజనేయుడి ప్రతిమకు అభిషేకం, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామీజీ భక్తులనుద్దేశించి మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ధర్మ రక్షణకు పూనుకోవాలని, నిత్యం హనుమాన్ చాలీసా పారాయణం చేయాలని పేర్కొన్నారు. వచ్చే జనవరి ఒకటిన తిరుపతిలోని అంజనాద్రి వద్ద కోటి మందితో హనుమాన్ చాలీసా పారాయణ మహాయజ్ఞం ఉంటుందని వివరించారు.

స్వామీజీని కలిసిన ఎమ్మెల్యే

హనుమాన్ దీక్షాపీఠం పీఠాధిపతి దుర్గాప్రసాద్ స్వామీజీని ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి కలిశారు. ఆయన ఆశీర్వచనం తీసుకున్నారు. ఆయన వెంట ఏఎంసీ మాజీ చైర్మన్ పీ కృష్ణ, నాయకులు మురళీగౌడ్, తోట రాము, రమేశ్ తదితరులున్నారు.

నిర్మల్ బస్టాండ్‌లో ప్రయాణికుల రద్దీ



ప్రయాణికులతో కిటకిటలాడుతున్న బస్టాండ్

నిర్మల్‌టౌన్: రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ బుధవారం రద్దీగా కనిపించింది. ప్రయాణికులతో బస్టాండ్ ప్రాంతమంతా కిటకిటలాడింది. ఈ సందర్భంగా డిపో మేనేజర్ ప్రతిమారెడ్డి మాట్లాడుతూ.. అన్ని రూట్లలో ప్రయాణికులకు అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణించి సరక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని సూచించారు. ఈనెల 30, 31 తేదీల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే మహిళలకు లక్కీడ్రాలో పాల్గొనే అవకాశం కల్పించినట్లు చెప్పారు. ప్రయాణికులు బస్సు దిగగానే టికెట్ వెనకాల పేరు, ఫోన్ నంబర్ రాసి బస్టాండ్‌లో ఏర్పాటు చేసిన డ్రాప్‌బాక్స్‌లో వేయాలని సూచించారు.

వాహనాల తనిఖీ



వాహనదారులకు సూచనలిస్తున్న టౌన్ సీఐ

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట డబుల్‌బెడ్రూం ఇళ్లలో బుధవారం టౌన్ సీఐ పురుషోత్తం ఆధ్వర్యంలో పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించారు. సరైన పత్రాలు లేని 61 ద్విచక్ర వాహనాలు, 28 ఆటోలు, ఒక ఐచర్ వాహనం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా టౌన్ సీఐ మాట్లాడారు. ఎస్పీ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. వాహనాలకు హైసెక్యూరిటీ నంబర్ ప్లేట్లు వాడాలని తెలిపారు. నంబర్ ప్లేట్లు విరగగొట్టినా, వంచినా కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పట్టణ ట్రాఫిక్ ఎస్సైలు రాజశేఖర్, దేవేందర్, ఎస్సై రమాదేవి తదితరులున్నారు.

లక్ష్మణచాంద: మండలంలోని రాచాపూర్ గ్రామంలో సోన్ సీఐ నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ధ్రువపత్రాలు లేని 57 ద్విచక్రవాహనాలు, ఒక ఆటో స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పాఠశాల ఆవరణలో నిర్వహించిన సమావేశంలో సీఐ మాట్లాడారు. అపరిచితులు ఫోన్ చేసి ఏ వివరాలు అడిగినా చెప్పవద్దని, యువకులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని, ప్రతిఒక్కరూ రోడ్డు నియమాలు పాటించాలని సూచించారు. లక్ష్మణచాంద, సోన్ ఎస్సైలు శ్రీకాంత్, రవీందర్, 40మంది పోలీస్ సిబ్బంది, ఉపసర్పంచ్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ చిత్రపటానికి రాఖీ



కేసీఆర్ చిత్రపటానికి రాఖీ కడుతున్న ఉద్యోగులు

నిర్మల్ రూరల్: రెగ్యులరైజ్ చేయాలని రెండురోజులుగా సర్వశిక్ష అభియాన్ కేజీబీవీ ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. బుధవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం ఎదుట సీఎం కేసీఆర్ చిత్రపటానికి రాఖీలు కట్టి కట్టారు. దీక్షా శిబిరాన్ని పీఆర్టీయూ, టీయూటీఎఫ్, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నేతలు కలిసి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు నరేంద్రబాబు, ప్రధాన కార్యదర్శి బీవీ రమణారావు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్ నాయక్, టీయూటీఎఫ్ అధ్యక్షుడు లక్ష్మీప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి తోడిశెట్టి రవికాంత్ తదితరులు పాల్గొన్నారు.

యశోద హాస్పిటల్స్ సికింద్రాబాద్

దేవేందర్ రెడ్డి సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్

ఖానాపూర్ రోడ్, నిర్మల్

ఊపిరితిత్తుల వ్యాధులకు కన్సల్టేషన్

ప్రతి నెల 1వ శుక్రవారం, ఉ॥ 9:30 గం॥ - మ॥ 1:30 గం॥

సంప్రదించవలసిన వారు:

దగ్గు, దురద, ముక్కు నుండి నీరు కారడం, తుమ్ములు, శ్వాస పీల్చుకోవడంలో ఇబ్బందులు, ఛాతి బరువుగా పట్టేసి ఉండుట, చిరకాలంలో శ్వాస పీల్చుకోవడం కష్టంగా ఉండడం, ఆయాసంతో నిద్ర మేల్కొనేవారు విపరీతమైన దగ్గు, దగ్గినప్పుడు గల్లపడినట్లయితే, ప్రస్తుతం చికిత్స తీసుకుంటూ ఉపశమనం పొందక మార్పు కోరుకునేవారు

MD, FCCP, FAPSR (Pulmonology)

అపాయింట్‌మెంట్ కొరకు: 915 498 9214 | 897 810 0944

క్లుప్తంగా

108లోప్రసవం



శిశువును అందిస్తున్న సిబ్బంది

సిరికొండ: మండల కేంద్రానికి చెందిన గర్భిణి రేష్మా పురిటినొప్పులు రావడంతో కుటుంబ సభ్యులు 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది గర్భిణిని ఇచ్చోడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో సుంకిడి గ్రామం వద్ద మగ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఈఎంటీ కాశీనాథ్, పైలెట్ ప్రవీణ్ కుమార్ అన్నారు.

డివిజన్ వినతిని ప్రభుత్వానికి చేరవేయండి



పీవోకు విన్నవిస్తున్న సభ్యులు

బోథ్: బోథ్ డివిజన్ ఏర్పాటుపై ప్రభుత్వానికి సమాచారాన్ని చేరవేయాలని ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయికి బుధవారం బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులు విన్నవించారు. గతవారం తాము ఇచ్చిన వినతిని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. లేకుంటే రానున్న ఎన్నికలను బహిష్కరిస్తామని తెలిపారు. బుధవారం ఓటరు ప్రక్రియ గురించి ఆమె అధికారులతో సమావేశం నిర్వహించారు. 18ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని, ఓటింగ్ గురించి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు పాల్గొన్నారు.

నీకు నేను.. నాకు నీవు రక్ష



అన్నా చెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగనే రాఖీ. ఈ పండుగను ఇప్పుడు దేశవ్యాప్తంగా అందరూ ఘనంగా జరుపుకుంటున్నారు. సోదరి తన సోదరుడు హోన్నత శిఖరాలకు ఎదగాలని కోరుకుంటూ రాఖీ కట్టి ఎల్లప్పుడూ అన్నకు అండగా ఉంటానని చెప్తుంది. సోదరి కట్టిన రక్షాబంధనాన్ని స్వీకరించిన అన్న తానెప్పుడూ చెల్లెలికి రక్షగా ఉంటానని ఈ పండుగ ద్వారా తెలియజేస్తారు. సమాజంలో బంధాలు, అనుబంధాలు దూరమవుతున్న తరుణంలో రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కా తమ్ముళ్ల అనుబంధాలను బలోపేతం చేస్తుంది. సోదర సోదరీమణుల మధ్య ఉండే అనుబంధానికి, ప్రేమానురాగాలకు అద్దం పట్టే పండుగ కావడంతో మానవ సంబంధాల మెరుగుదలకు, విచక్షణకు ఇది ఎంతో దోహదం చేస్తుంది. ఆత్మీయుల మధ్య అనుబంధాలకు, ఐకమత్యానికి, పరస్పర సహకారానికి చిహ్నంగా రక్షాబంధనం నిలుస్తుంది. రాఖీ పండుగ సందర్భంగా జిల్లాలోని సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కా చెల్లెళ్లు తమ అభిప్రాయాలను సాక్షితో పంచుకున్నారు.

- సోదరులకు రాఖీ కట్టేందుకు సుదూరాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళ్లు
- అనుబంధాలను బలోపేతం చేస్తున్న రక్షా బంధన్
- తమ అభిప్రాయాలను పంచుకున్న సోదరీమణులు

నిర్మల్ ఖిల్లా: అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక రాఖీ పండగ. రాఖీని కట్టేందుకు, రక్షాబంధన్ వేడుకలను నిర్వహించుకునేందుకు ఎక్కడెక్కడో దూరాన ఉన్న అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్లు సొంత ప్రాంతాలకు తరలివస్తుంటారు. ఈ క్రమంలో వారిమధ్య అనుబంధానికి రక్షా కవచంగా కట్టే ఈ రాఖీ ఎంతో ప్రత్యేకమైనది. అనాధికాలం నుంచి సంప్రదాయంగా వస్తున్న ఈ రక్షాబంధన్ వేడుక సోదరి సోదరీమణుల అనుబంధాన్ని మరింత దృఢపరుస్తోంది. ఈ క్రమంలో వారి జీవితాలను తీర్చిదిద్దిన ఉదంతాలు ఎన్నో ఉన్నాయి. అలాంటి వారి అభిప్రాయాలతో సాక్షి కథనం..

ఐదుగురు చెల్లెళ్ల అనుబంధాల రాఖీ...

నిర్మల్ జిల్లా కేంద్రంలో నివాసముండే అర్ల గంగాధర్ ప్రస్తుతం ఎక్సైజ్ సబ్ ఇన్స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి గంగామణి, సంతోషిణి, లావణ్య, భాగ్యలక్ష్మి, ఉదయరాణి ఐదుగురు చెల్లెల్లు ఉన్నారు. వీరి స్వగ్రామం ఆదిలాబాద్ జిల్లాలోని సొనాల. గంగాధర్ వృత్తిరీత్యా నిర్మల్ జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉపాధ్యాయుడిగా, ఎంపీడీవోగా, డీపీవోగా పనిచేశారు. ప్రస్తుతం జిల్లా కేంద్రంలోని భాగ్యనగర్‌లో స్థిరపడ్డాడు. దిగువ మధ్య తరగతి కుటుంబం నుంచి వచ్చిన వీరు ప్రస్తుతం ఎక్సైజ్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్నారు. ఇతను ఐదుగురు చెల్లెళ్లను తన మార్గనిర్దేశనంలో ఉన్నత చదువులు చదివించి అందరినీ ఉన్నతంగా తీర్చిదిద్దారు. వీరిలో ఇద్దరు డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌లుగా పనిచేస్తుండగా.. మరో ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. వీరందరూ ఏటా రాఖీ పౌర్ణమి పండగను ఒకేచోట జరుపుకుంటారు. జీవితాల్లో ఎక్కడెక్కడో స్థిరపడిన పండగ రోజు మాత్రం ప్రత్యేకంగా కలుసుకొని వేడుకలను జరుపుకుంటారు. తోబుట్టువులుగా చిన్నతనం నుండి కలిసి పెరిగినా, ప్రస్తుతం కుటుంబ బాధ్యతల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. తమకిష్టమైన తన అన్నయ్య మార్గదర్శనంలో కష్టపడడం తోనే ఈ స్థితిలో ఉన్నామని ఈ చెల్లెళ్లు అంటున్నారు. వృత్తిరీత్యా ఎంత బిజీగా ఉన్నా తమ అన్నయ్యను కలుసుకొని సంతోషంగా రాఖీ పండగను జరుపుకుంటున్నామని ఆ ఐదుగురు చెల్లెళ్లు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. సోదరుడికి బుధవారం రాఖీ కట్టి స్వీట్లు తినిపించారు.

రాఖీ కట్టి.. హెల్మెట్ ఇచ్చి



రాఖీ కడుతున్న సోదరి

ఖానాపూర్:ఆ ఇద్దరు చట్టాల గురించి చెప్పేవారే.. ఒకరు రూ ల్స్ గురించి మాట్లాడితే... ఇంకొకరు రూల్స్ గురించి వాదిస్తారు. అన్నకు రాఖీ కట్టి.. హెల్మెట్ పెట్టు అనే నినాదం మేరకు సోదరుడికి గతంలో పలుమార్లు హెల్మెట్‌ను అందించింది. మస్కాపూర్ గ్రామానికి చెందిన రవీందర్ భార్య అరుణ భైంసా కోర్టులో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా పనిచేస్తుంది. సోదరుడు భానుకర్ కృష్ణ నిజామాబాద్ జిల్లా వర్ని ఎస్సైగా పనిచేస్తున్నాడు.

బంధం ఎంతో ఆత్మీయం

ఉట్నూర్‌రూరల్: అన్నాచెల్లెల అనుబంధానికి ప్రతీ రూపమే రాఖీ అని లక్కారం మాజీ సర్పంచ్ మర్సుకోల తిరుపతి అన్నారు. రక్ష బంధన్ సందర్భంగా లక్కారం గ్రామ మహిళలు ఆయనకు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. అదే విధంగా ఆయా ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలల్లో రక్షా బంధన్ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. సరస్వతి జ్ఞాన విద్యాలయం పాటశాలలో విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కడుతూ శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.



రాఖీకడుతున్న మహిళలు

దీక్షాపరులకు రాఖీలు కట్టిన విద్యార్థులు



దీక్షలోని వారికి రాఖీ కడుతున్న విద్యార్థులు

బోథ్: బోథ్‌ను డివిజన్ చేయాలని డిమాండ్ చేస్తూ చేస్తున్న దీక్షలు బుధవారానికి 46వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో కూర్చున్న దీక్షా పరులకు నాగభూషణం పాఠశాల విద్యార్థులు రాఖీలు కట్టారు. బోథ్ డివిజన్ సాధించే వరకు పోరాటాన్ని ఆపవద్దని విద్యార్థులు తెలిపారు. ఉద్యమ నిర్వహణ నిమిత్తం ఆ పాఠశాల కరస్పాండెంట్ కిశోర్ రూ.5వేలను బోథ్ డివిజన్ సాధన సమితి సభ్యులకు అందించారు.

అమెరికాకు రాఖీ పంపుతాను



తాంసి: మా సొంత గ్రామం భీంపూర్ మండలం కరంజి(టి). ప్రస్తుతం వివాహం జరగడంతో మహారాష్ట్రలోని పాటన్‌లో ఉంటున్నాను. తమ్ముడు వృత్తిరీత్యా అమెరికాలో ఉంటాడు. అన్నాచెల్లెల అనుబంధానికి గుర్తుగా రాఖీని పంపుతాను.పదేళ్లకు పైగా రాఖీని పంపిస్తున్నాను.

– రజని, గృహిణి, మహారాష్ట్ర

మా అనుబంధాన్ని రెట్టింపు చేస్తుంది



గుడిహత్నూర్: మాది నాందేడ్ జిల్లాలోని నిస్‌పూర్. నేను ఏటా రాఖీ పండగకు నా ముగ్గురు తోబుట్టులకు రాఖీ కట్టి వారితో సరదాగా గడుపుతా. ఈ రాఖీ పండుగ మా అనుబంధాలు, ప్రేమాను రాగాలను రెట్టింపు చేస్తుంది. ఈ రాఖీ పండుగ మరింత ఆప్యాయతకు నీడగా నిలుస్తోంది.

– కాగ్నే ఇందుబాయి, నిస్‌పూర్, మహారాష్ట్ర

దూది గొండలే ప్రత్యేకం

- భైంసాలో నేటికీ అవే పంపిణీ
- రాఖీ పౌర్ణమికి ముందుగానే ఇంటింటికీ ఇస్తారు



రాఖీ దూదిగొండలు

భైంసా: అక్కాతమ్ముళ్ల అనురాగానికి, అన్నాచెల్లెల్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా భైంసా ప్రాంతంలో పూజారులు, అర్చకులు ఇంటింటా ఇప్పటికీ దూదిగొండలే ఇస్తారు. ఈ ప్రాంతం మహారాష్ట్రకు ఆనుకుని ఉండడంతో రాఖీలను గొండలు అని పిలుస్తారు. సన్నని దారానికి దూదిని పసుపులో, కుంకుమలో, చంద్రం , గులాలు ఇలా పూజకువాడే వాటిలో కలుపుతారు. ఇలా కలిపిన దూదినుంచి దారాన్ని బయటకుతీసి గొండగా కడుతారు. ఇలా తయారుచేసిన గొండలను గ్రామాల్లో ముందుగా అక్కడి పూజారులు ప్రత్యేక పూజలు చేస్తారు. పౌర్ణమికి రెండు రోజుల ముందుగానే ఇంటింటికి వెళ్లి ఈ దూదిగొండలను పంచిపెడతారు. దూదిగొండలు తీసుకున్నవారు ఇంటికివచ్చిన పూజారుల కాళ్లు కడిగి వారిని లోనికి ఆహ్వానిస్తారు. ఇచ్చిన దూదిగొండలు తీసుకుని అందుకు ఇంట్లో పండించిన బియ్యం, జొన్నలు, పప్పులు దానం చేస్తుంటారు. రాఖీ పౌర్ణమి రోజున ఇంటికి వచ్చే ఆడపడుచులు పూజారులు ముందుగా ఇచ్చిన ఈ దూదిగొండలనే కడతారు.

ఆడబిడ్డలకు పుట్టింటి కానుకలు...

తోబుట్టువులకు దూదిగొండలు చేతికి కట్టగానే కానుకలు అందిస్తారు. సోదరులు పుట్టింటి ఆడపిల్ల కాళ్లమొక్కి నగదు, బట్టలు కానుకగా ఇస్తుంటారు. రాఖీ పౌర్ణమి నుంచి పొలాల అమావాస్య వరకు 15 రోజులపాటు వీలు దొరికినప్పుడల్లా దూర ప్రాంతంలో ఉండే పుట్టింటి ఆడపడుచు ఎప్పుడైనా వచ్చి తోబుట్టువులకు రాఖీ కట్టి వెళ్తుంది. రాఖీ పౌర్ణమి అంటే ఇక్కడి వారు ప్రత్యేకంగా భావిస్తారు.

సంఘాల ఆధ్వర్యంలో...

ఇంట్లో రాఖీ పౌర్ణమి సందర్భంగా తోబుట్టువులతో పండుగ చేసుకున్న అనంతరం అంతా బయటకు వస్తారు. సంఘాల ఆధ్వర్యంలో సామూహికంగా రాఖీ పౌర్ణమి వేడుకలు జరుపుకుంటారు. ప్రతీ పల్లెటూరిలోనూ ఈ వేడుకలు వైభవంగా జరుగుతాయి. హిందువాహిని, ఆర్‌ఎస్‌ఎస్‌లతోపాటు సరస్వతీ శిశుమందిరాల విద్యార్థులు డివిజన్‌లోని అన్ని ప్రాంతాలకు వెళ్లి రాఖీ పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు.

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
ముధోల్ నియోజకవర్గ ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు, ప్రజా ప్రతినిధులకు, అధికారులకు, రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
S. సుధాకర్, శ్రీ గణేష్ మెడికల్, ముధోల్
B. లక్ష్మీ నారాయణ MPTC గన్నోర
దేవన్న BJP నాయకులు
అగ్గు మహేష్, రాజురా

రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
మన మంచిర్యాల జిల్లాలో "మేగా BGI మాన్యుఫ్యాక్చరింగ్ కంపెని" కలర్ కోటెట్ (కూలింగ్ షీట్స్) లింక్ మెష్ (జాలిఫెన్సింగ్)తో ప్రారంభించినాము. వివిధ వర్గాల ప్రజలకు, వ్యాపారస్తులకు అందుబాటు ధరలలో లభించును.





* ఫంక్షన్‌హాల్స్ * హోటల్స్ * పెట్రోల్ బంక్స్
* దాబా * రైస్ మిల్స్ * సినిమా హాల్స్
* గోడౌన్స్ * పౌల్ట్రిఫామ్స్ * ఫ్యాబ్రికెట్ వర్క్స్
* మెకానిక్ షెడ్స్ * సింగరేణి / గవర్నమెంట్ కాంట్రాక్టర్స్
* వెల్డర్స్ * హార్డ్‌వేర్ షాపు * పార్కింగ్ షెడ్స్
* సివిల్ వర్క్స్ కొరకు (లింక్‌మిష్/కలర్ కోటెడ్ షీట్స్)
వివిధ సైజులలతో, వివిధ కలర్స్ మరియు వివిధ డిజైన్స్‌లో లభించును
గమనిక: మార్కెట్ ధర కన్న తక్కువ ధరలలో లభించును.
BGI MANUFACTURERS PVT LTD.
Flat No. 112, Sy No. 33/8, N.H-363, 200 ft Road,
Sheshupally Shivar, MANCHERIAL
Cell: 988 555 8222, 9063170170, 950 266 4773.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు
సంతానము లేని దంపతులకు శుభవార్త...



సంతానము లేని దంపతులకు IUI పద్ధతిలో ట్రీట్‌మెంట్ చేయుటకై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ లైసెన్స్ పొందిన హాస్పిటల్ బర్త్‌రూట్స్ హాస్పిటల్... సంతానము కొరకు ఆరాటపడే దంపతులు డాక్టర్ గారిని సంప్రదిస్తే సరియైన ట్రీట్‌మెంట్ మరియు కౌన్సిలింగ్ ఇవ్వబడును. ఎంతోమంది దంపతులు మా ట్రీట్‌మెంట్ తో సంతానం పొందారు. మావద్ద నొప్పి లేకుండా HSG ట్యూబ్ టెస్టింగ్, కుటుంబ నియంత్రణ, స్త్రీ సంబంధిత అన్ని రకాల వ్యాధులకు ట్రీట్‌మెంట్స్ చేయబడును.
డా॥ శ్రుతి గోలి, M.B.B.S., DNB OBG
ప్రసూతి మరియు స్త్రీల వైద్య నిపుణురాలు,
లాపరోస్కోపిక్ సర్జన్ & సంతాన సాఫల్య నిపుణురాలు
ఇటీవల జర్మనీ నుండి దిగుమతి చేసుకున్న లాపరోస్కోపి ఆధునిక పరికరాలతో డాక్టర్ శ్రుతి గోలి గారు స్వయంగా లాపరోస్కోపి ఆపరేషన్లు చేస్తారు.
బర్త్‌రూట్స్ హాస్పిటల్
బెల్లంపల్లి చౌరస్తా, మంచిర్యాల
సెల్: 91779 85540, 91779 12007

తీజ్ ఉత్సవాలు ప్రారంభం

- సంప్రదాయ పూజలు.. ఉత్సాహంగా పాల్గొననున్న యువతులు



తీజ్ ఉత్సవాల్లో గిరిజన యువతులు (ఫైల్)

ఉట్నూర్‌రూరల్: శ్రావణ మాసాన్ని పురస్కరించుకొని ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు తీజ్ ఉత్సవాలను బుధవారం సాయంత్రం నుంచి ప్రారంభించారు. ఏజెన్సీలోని గిరిజన తండాల్లో తీజ్ ఉత్సవాలను ఘనంగా జరుపుకునేందుకు గిరిజనులు ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. బుధవారం సాయంత్రం నుంచి రాత్రి వరకు మండలంలోని లింగోజీతాండ, హస్నాపూర్, సుభాశ్‌నగర్ తదితర గ్రామాల్లో ప్రత్యేక పూజల నడుమ ఉత్సవాలను ప్రారంభించారు. పెళ్లికాని యువతులు తమ జీవితాల్లో కొత్త మలుపులు వచ్చేలా అన్ని శుభకార్యాలు జరిగేలా ఆరాధ్య దైవాన్ని ప్రార్థిస్తూ ఈ వేడుకలను ప్రారంభిస్తారు. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఈ తీజ్ ఉత్సవాల్లో యువతులు ఉపవాస దీక్షల నడుమ భక్తిశ్రద్ధలతో పండుగను జరుపుకుంటారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని ఈ ఉత్సవాలను నాయక్ ఇంటి వద్ద ప్రారంభిస్తారు. కృష్ణాష్టమి వరకు తొమ్మిది రోజుల పాటు ఈ వేడుకలు నిర్వహించుకుంటారు. రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని లంబాడాలు తమ నాయక్ ఇంటి వద్ద పెద్దల సమక్షంలో కుల దైవం జగదాంబాదేవి, సేవాలాల్ మహరాజ్ ఆశీస్సులతో వేడుకలు ప్రారంభిస్తారు. సంప్రదాయ పాటలు పాడుతూ నేరేడు చెట్టు వద్ద ఆడపడుచులు ప్రత్యేక పూజలు చేస్తారు. అక్కడి నుంచి పాటలు పాడుతూ నాయక్ ఇంటి వద్దకు చేరుకొని ముందుగా నాయక్, పెద్ద మనుషుల చేతుల మీదుగా వెదురుతో తయారు చేసిన బుట్టలను తీసుకుని అడవి నుంచి తీసుకొచ్చిన పుట్ట మట్టిని బుట్టలో నింపి గోదుమ విత్తనాలు నాటుతారు. అనంతరం బుట్టలను భద్రంగా ఒక దగ్గరపెట్టి అవి మొలకెత్తే వరకూ ప్రతీరోజు ఉదయం, సాయంత్రం నీళ్లు పోస్తుంటారు. ఈ విత్తనాలు మొలకెత్తాక ఆ బుట్టలతో సంప్రదాయ రీతిలో తమ దైవాల వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రతీరోజు తీజ్ సంబరాలు జరుపుకుంటారు. ఈ సంబరాల్లో వారి ఆటపాట నృత్యాలు అందరిని ఆకట్టుకునేలా ఉంటాయి.

కేంద్ర, రాష్ట్ర పథకాల అమలుపై అధ్యయనం

- మూడో రోజు ట్రెయినీ ఐఏఎస్‌ల పర్యటన



చేనును పరిశీలిస్తున్న ట్రెయినీ కలెక్టర్లు

ఇచ్చోడ: మండంలోని మేడిగూడలో బుధవారం ట్రెయినీ ఐఏఎస్ అధికారులు మారినవిక్టర్, అభినవ్ ఖండేల్‌వాల్, నెల్సన్‌మంగ, కింగ్‌తెహరింగ్, దివ్య జైన్, ప్రనుశ్‌శర్మ, దుర్గప్రసాద్ పర్యటించారు. ప్రతీ ఇంటికి తిరుగుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల అమలుపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థ, అంగన్‌వాడీ, ప్రభుత్వ పాఠశాల పనితీరును, పాఠశాలల్లో హాజ రు పట్టికను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రం ద్వారా చిన్నారులకు, గర్భిణులకు అందుతున్న పౌ ష్టికాహారం వివరాల రికార్డులు పరిశీలించారు. గర్భి ణులతో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆదివాసీ ఆచా ర, సంప్రదాయలను గ్రామస్తుల ద్వారా అడిగి తెలు సుకున్నారు. పక్కనే ఉన్న పంట పొలాల్లో పత్తి, సో యా పంటలను పరిశీలించారు. సాగుపై పెట్టుబడులు, పంటలపై వస్తున్న లాభాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట పంచాయతీ కార్యదర్శి రాజు, సర్పంచ్ భీంరావు ఉన్నారు.

ఆరోగ్య పథకాలు పక్కాగా అమలు చేయాలి



సూచనలిస్తున్న రీజినల్ డైరెక్టర్ అనురాధ

జైనథ్: ప్రతీ పీహెచ్‌సీ, సబ్‌సెంటర్లలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలు పక్కాగా అమలు చేయాలని కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వశాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ అనురాధ ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలోని జామ్ని గ్రామంలోని సబ్‌సెంటర్‌ను లెప్రసీ జాయింట్ డైరెక్టర్ జాన్‌బాబుతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులు, అందుబాటులోని మందులపై ఆరా తీశారు. అనంతరం లెప్రసీ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాతాశిశు సంక్షేమంపై మహిళలకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధుల లక్షణాలు, ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై వివరించారు. ప్రభుత్వాస్పత్రుల్లో ప్రసవాలు పెరిగేలా చూడాలని, మాతాశిశు సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా లెప్రసీ అండ్ టీబీ కంట్రోల్ అధికారి మెట్పెల్లివార్ శ్రీకాంత్, సిబ్బంది ఉన్నారు.

ఘనంగా దీక్ష గురువు జన్మదిన వేడుకలు

- వెండి కిరీటాన్ని బహూకరించిన భక్తులు
- హాజరైన మాజీ ఎమ్మెల్సీ రాములునాయక్



ప్రేంసింగ్ మహరాజ్ జన్మదిన వేడుకల్లో భక్తులు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోని జాతీయ బంజారా దీక్ష భూమి వద్ద దీక్ష గురువు శ్రీసద్గురు ప్రేంసింగ్ మహరాజ్ జన్మదిన వేడుకలను రాఖీ పౌర్ణిమి సందర్భంగా బుధవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. వెండి కిరీటాన్ని భక్తులు బహూకరించారు. మాజీ ఎమ్మెల్సీ రాములు నాయక్ దీక్ష భూమిని సందర్శించి మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. టీఎన్‌జీవోల సంఘం అధ్యక్షుడు అజ్మీరా శ్యాంనాయక్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ రాథోడ్ గణేశ్, రాథోడ్ శేషరావు ఉన్నారు.

గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు



గుడుంబాను పట్టుకున్న ఎక్సైజ్ అధికారులు

మామడ: మండలంలోని వెంకటపూర్ సమీపంలోని గోదావరిలో బుధవారం ఎక్సైజ్ అధికారులు గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ డ్రమ్ముల్లో నిల్వ చేసిన 900 లీటర్ల బెల్లంపానకాన్ని పట్టుకుని ధ్వంసం చేశారు. ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్, సిబ్బంది నరెందర్, ముత్యం, ఇర్ఫాన్, భాస్కర్ పాల్గొన్నారు.

వికటించిన వైద్యం



పాప ఒంటిపై దద్దుర్లు

బోథ్: మండల కేంద్రానికి చెందిన కూన రాము కూతురు కుషాగ్రికి వైద్యం వికటించింది. రాము తెలిపిన వివరా ల ప్రకారం.. రెండున్నరేళ్ల చిన్నారి కుషాగ్రి ఈ నెల 26వ తేదీన రాత్రి కడుపునొప్పి రావడంతో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లాడు. విధుల్లోని వైద్యుడు కడుపునొప్పికి సిరప్, మందులు రాసిచ్చాడు. మరుసటి రోజు పాప శరీరంపై దద్దుర్లు వచ్చాయి. దీంతో మరింతగా అస్వస్థతకు గురైంది. మళ్లీ మండల కేంద్రంలోని ఓ వైద్యుడి దగ్గరికి వెళ్లి చూపించగా ఆ మందులను వాడొద్దని తెలిపాడు. అనంతరం ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లిగా విధుల్లోని సిబ్బంది దుర్భాషలాడారు. దీంతో చేసేది లేక నిర్మల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా రక్తంలో ఇన్‌ఫెక్షన్ ఉందని తెలిపారు. బోథ్ ఆస్పత్రిలో చిన్నపిల్లల డాక్టర్ లేక ఈ దుస్థితి నెలకొందని, తన కూతురికి ఏమైనా జరిగితే పూర్తి బాధ్యత వైద్యులే వహించాలని ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు.

మట్కా నిర్వాహకుడి అరెస్టు

ఆదిలాబాద్‌టౌన్: మట్కా నిర్వాహకుడు షేక్ ఇర్షద్‌ను టూటౌన్ పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఎస్సై రమణారెడ్డి వివరాల ప్రకారం.. పట్టణంలోని సుందరయ్యనగర్‌లో సుల్తాన అనే మహిళ ఇంటిని రెండు నెలల క్రితం అద్దెకు తీసుకుని మట్కా నిర్వహిస్తున్నాడు. పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి తనిఖీ చేయగా మట్కా చీటీలు లభ్యమైనట్లు తెలిపారు. ఇతడి నుంచి రూ.3వేల నగదుతో పాటు రెండు మట్కా పుస్తకాలను స్వాధీనం చేసుకున్నారు. మరో మట్కా నిర్వాహకుడు మహ్మద్ లతీఫ్ పరారయ్యాడు. అద్దెకు ఇల్లిచ్చిన యజమాని సుల్తానపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

అత్యాచారయత్నం కేసులో ఒకరికి 10 ఏళ్ల జైలు

నిర్మల్‌టౌన్: అత్యాచారయత్నం కేసులో నిర్మల్ న్యాయస్థానం ఒక్కరికి పదేళ్ల జైలు, జరిమానా విధించింది. కోర్టు సమన్వయ అధికారి సక్రియ నాయక్ వివరాల ప్రకారం.. కుభీర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ కొన్ని సంవత్సరాలుగా మానసిక అనారోగ్యంతో బాధపడుతోంది. 14 సెప్టెంబర్ 2022వ తేదీన రాత్రి సమయంలో ఆ మహిళ ఇంటి బయట పడుకుని ఉండగా అదే గ్రామానికి చెందిన ఎద్దుల పండరి ఇంటి పక్కనే గల పశువుల కొట్టంలోకి తీసుకెళ్లి అత్యాచారయత్నానికి పాల్పడగా అదే సమయంలో ఆ మహిళ కొడుకు తల్లి అరుపులు విని వెళ్లేసరికి పండరి పారిపోయాడు. ఈ విషయంపై కుభీర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా ప్రస్తుత ఎస్సై షరీఫ్ కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్ట్ చేశాడు. చార్జిషీట్ దాఖలు చేసి కోర్టులో హాజరు పరిచారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.రమణారావు 14మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టి నేరం రుజువు చేయడంతో అసిస్టెంట్ సెషన్స్ జడ్జి అజేశ్‌కుమార్ పండరికి 10ఏళ్ల జైలు శిక్షతో పాటు, రూ.5వేల జరిమానా విధిస్తూ బుధవారం తీర్పునిచ్చారు.

గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల స్వీకరణ

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ పరిధిలో ఖాళీగా ఉన్న గోపాలమిత్ర కేంద్రాల ఏర్పాటుకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు జిల్లా పశుగణాభివృద్ధి అధికారి కిషన్ ఒక ప్రకటనలో బుధవారం తెలిపారు. నిర్మల్ జిల్లాలో కుభీర్ మండలంలోని మర్లగొండ, భైంసా మండలం వానల్‌పహాడ్, బాసర మండలం కౌట, మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలంలోని దేవులవాడ, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాలో పెంచికల్‌పేట్ మండలంలోని బొంబాయి గూడ, లింగాపూర్ మండలంలోని ఘట్‌కల్‌మంగి, రెబ్బెన మండలంలోని గోలేటిలో ఖాళీగా ఉన్నట్లుగా తెలిపారు. వీటికి పదో తరగతి ఉత్తీర్ణులై, 18–35 ఏళ్ల మధ్య వయస్సు కలిగి ఉన్న వారు అర్హులన్నారు. అలాంటి వారు ఫొటోతో కూడిన స్థానిక నివాస ధృవీకరణ పత్రం(ఆధార్ లేదా రేషన్‌కార్డు) ఫొటోతో తమ దరఖాస్తులను సెప్టెంబర్ 11వ తేదీ సాయంత్రం 5గంటల్లోగా జిల్లా కేంద్రంలోని జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు.

యువరైతు ఆత్మహత్య

నర్సాపూర్(జి): మద్యం మత్తులో జాదవ్ సాయినాథ్(26) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని బూర్గుపల్లి(జి)తండాలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. బూర్గుపల్లితండాకు చెందిన జాదవ్ సాయినాథ్ బుధవారం సాయంత్రం మద్యం తాగి రావడంతో భార్య మందలించింది. దీంతో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్
WANTED
■ జాబ్ గ్యారంటీ 18–50సం॥ల మహిళలు, పురుషులు అర్జెంటుగా కావలెను. ఫ్రీ రూం+ భోజనం, జీతం: 25000/–వేల వరకు. ఫోన్ : 9966310431 [HA-10956]
గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
For Classifieds, Advertisements Contact:
9951602888
9010299065
9951602823
9010608462